సాక్షి
సూర్యాపేట
I
గురువారం । 2 । అక్టోబర్ । 2025



న్యూస్‌రీల్

ప్రజలకు ఎస్పీ దసరా శుభాకాంక్షలు

సూర్యాపేటటౌన్ : దసరా పర్వదినం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరఫున ప్రజలు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ నరసింహ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి ప్రజల జీవితాల్లో తేజస్సు, విజయాన్ని తేవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. సంతోషకరమైన వాతావరణంలో, ఆరోగ్యకరంగా అందరూ కలిసిమెలిసి సోదరాభావంతో పండుగ జరుపుకోవాలని కోరారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా

సూర్యాపేటటౌన్ : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండుగ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరిలో చెడు తొలిగి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శమీపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి మనదని పేర్కొన్నారు. పాలపిట్ట, జమ్మి చెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించిన ఘనత కేసీఆర్ దేనని తెలిపారు. దసరా వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ విజయదశమి అందరికీ విజయాలు చేకూర్చాలని, ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 4,391 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో బుధవారం నాటికి 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో 644.30 అడుగుల వద్ద ఉంది. నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువలో ఉండడంతో అధికారులు బుధవారం ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 3,884 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 478 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం 4,362 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.04 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

టెట్ నుంచి మినహాయించాలి

హుజూర్‌నగర్ : సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) రాష్ట్ర పరిశీలకుడు కొనకంచి వీర రాఘవులు కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సంఘ జిల్లా సమావేశంలో మాట్లాడారు. అనంతరం జిల్లాకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంధం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పాలూరి అంజయ్య, ఆర్థిక కార్యదర్శిగా నేలపట్ల సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్లుగా అత్తి వెంకటేశ్వర్లు, ఓరుగంటి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అదనపు ప్రధాన కార్యదర్శులుగా బి. రామచంద్రారెడ్డి, రాంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా టి. భాస్కరరావు, బూర వెంకటేశ్వర్లు, భూక్య చందూలాల్, గుండు ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా కీత శ్రీనివాసరావు, భూక్య రూప్లా నాయక్, నందిపాటి సైదులు, షేక్ మాభాష, కంచుగంటి వెంకటేశ్వర్లు, అనంతు రామారావు, బి. పవన్, మహిళా ఉపాధ్యక్షులుగా ఎం. వెంకటరమణ, వి. రాణి, కార్యదర్శులుగా ఎం. రంగారెడ్డి, నుస్రత్ జహాన్, స్వర్ణలత, కల్పన, శివయ్య, రామ్మూర్తి, శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా టి. లోకేష్, మంజునాథ్‌లు ఎన్నికయ్యారు.

నేడు విజయ దశమి

- వేడుకలకు సిద్ధమైన ప్రజలు
- పట్టణాలు, పల్లెల్లో సందడి
- శమీ పూజకు, రావణ దహనానికి ఏర్పాట్లు

సూర్యాపేట అర్బన్: దసరా పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు.శమీ, ఆయుధ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటారు. దుర్గాదేవిని ఆరాధించడం, ఆమెను శక్తి స్వరూపిణిగా భావించడం ఈ పండుగ ప్రత్యేకత.

ఆయుధ పూజ

పోలీసులు దసరా రోజు ఆయుధాలకు పూజలు చేస్తారు. అలాగే పరిశ్రమల్లో యంత్రాలు, ఇతర పరికరాలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అలాగే చాలామంది దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లేదా సహజంగా ఉన్న జమ్మి వృక్షం వద్దకు వెళ్లి పూజలు చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. రావణ ప్రతిమలు ఏర్పాటు చేసి దహనం చేస్తారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శమీ పూజకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు.



సూర్యాపేట పట్టణంలో శమీ పూజకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేసిన ఏర్పాట్లు

మార్కెట్‌లలో సందడి

కొనుగోలుదారులతో మార్కెట్‌లు సందడిగా మారాయి. జీఎస్టీ తగ్గడంతో బైకులు, కార్లు కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది అసక్తి చూపుతున్నారు. దీంతో బైకులు, ఎలక్ట్రికల్, వస్త్రదుకాణాలు, ఫుట్‌వేర్, లేడీస్ ఎంపోరియం, పూలు, పండ్లు, కూరగాయల దుకాణాలు రాత్రి పొద్దుపోయే వరకు వినియోగదారులతో కిటకిటలాడాయి.

రహదారులపై వాహనాల రద్దీ

సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి పట్టణాల్లో రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. షాపింగ్ చేసేందుకు ప్రజలు గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లుండడంతో ట్రాఫిక్ నెలకొంది. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు, బైక్‌లపై సొంతూళ్లకు వెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి.



కొనుగోలు దారులతో రద్దీగా మారిన పూల సెంటర్

● మహిషాసుర మర్దినిగా కనకదుర్గ



హుజూర్‌నగర్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని స్వయంభువ శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం నిత్యకల్యాణతంతును ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు తెలిపారు. ఆత్మకూర్ మండలం బొప్పారం లో సత్యశోధక్ సమాజ్ వార్షికోత్సవం సందర్భంగా న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుండెబోయిన వెంకన్న, కాంచనపల్లి సైదులు, ఎర్ర ఉమేష్, నల్గొండ నాగయ్య, పగడాల సుధాకర్ రెడ్డి, ఇందూరు వినయ్, లింగయ్య, ఉపేందర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

టైగర్ దామన్న ఇక లేరు



- హైదరాబాద్‌లో కన్నుమూసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- కమ్యూనిస్టుల కంచుకోటలో కాంగ్రెస్‌కు జవసత్వాలు నింపిన నేత
- తుంగతుర్తి నుంచి నాలుగుసార్లు, సూర్యాపేట నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం
- గోదావరి జలాల సాధకుడిగా పేరు
- 3న సూర్యాపేటకు పార్థివదేహం
- 4న తుంగతుర్తిలో అంత్యక్రియలు

సూర్యాపేట : టైగర్ దామన్నగా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో పేరుగాంచిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లింగాలలో ఆయన జన్మించారు. తుంగతుర్తి గ్రామానికి చెందిన ఉప్పునూతల కౌసల్యాదేవి కుమార్తె వరూధినిదేవిని వివాహమాడారు. ఆయనకు కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఉన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి వెంకట్‌రెడ్డికి స్వయానా సోదరుడు. దామోదర్‌రెడ్డి 1985 నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా పనిచేశారు. పార్టీకి ఎంత కష్ట కాలం వచ్చినప్పటికీ పార్టీని వీడకుండా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో కార్యకర్తలకు అండగా నిలిచారు.

కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలు కొడుతూ..

1985 నాటికి తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టు ప్రాబల్యంతోపాటు కాంగ్రెస్ పార్టీలో అనేక చీలికలు పేలుకలు ఉండడంతో కమ్యూనిస్టులను ఓడించడం ఎవరికి సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో ఎర్రపహాడ్ జమీందారు జన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డికి స్వయంగా బావమరిది అయిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దించింది. 1985లో దామోదర్‌రెడ్డి మొదటిసారి తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటిదాకా తుంగతుర్తి నియోజకవర్గం కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది. 1989లో మరోసారి గెలుపొందారు. మూడోసారి 1994లో కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి సీపీఎం అభ్యర్థిపై విజయం సాధించారు. నాలుగోసారి 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర చేతిలో ఓటమిపాలయ్యారు. తిరిగి 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి అదే సంకినేని వెంకటేశ్వరరావుపై విజయం సాధించారు. ఈసారి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. అనంతరం 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీకి రిజర్వు కావడంతో.. సూర్యాపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి టీఆర్‌ఎస్ అభ్యర్థి పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిపై విజయం సాధించారు. 1985 నుంచి వరుసగా తుంగతుర్తి నుంచి మూడు సార్లు గెలుపొంది ఒక సారి ఓటమి చవిచూసి మరోసారి గెలుపొంది నాలుగుసార్లు విజయం సాధించారు. అనంతరం సూర్యాపేట నుంచి 2009లో మరోసారి విజయం సాధించి మొత్తంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985, 1989, 1994లో తెలుగుదేశం మిత్రపక్షాల హవాలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని స్థానాలు గెలుపొందగా.. కేవలం తుంగతుర్తి నియోజకవర్గంలో మాత్రమే దామోదర్ రెడ్డి గెలుపొంది కాంగ్రెస్ సత్తా చాటారు. 1985 కంటే ముందు తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టుల హవా కొనసాగి భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎమ్మెల్యేలుగా పనిచేయగా దామోదర్‌రెడ్డి రంగ ప్రవేశంతో కమ్యూనిస్టుల ప్రాబల్యానికిగండి కొట్టినట్లు అయింది. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించి అసెంబ్లీ టైగర్ గా పేరుగాంచిన దామోదర్ రెడ్డి కనుమూయడంతో తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ పెద్దదిక్కును కోల్పోయింది.



తుంగతుర్తిలో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో దామోదర్‌రెడ్డి (ఫైల్)

పేటలో మూడుసార్లు ఓటమి

దామోదర్ రెడ్డి 2014 నుంచి సూర్యాపేట నియోజకవర్గంలో పోటీచేసి వరుసగా 2014, 2018, 2023లో టీఆర్‌ఎస్ అభ్యర్థి జగదీశ్ రెడ్డి చేతిలో స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. దామోదర్ రెడ్డి అంత్యక్రియలు తుంగతుర్తి లోని వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 4వ తేదీన జరగనున్నాయి. మూడవ తేదీ 12 గంటలకు హైదరాబాదు నుండి ఆయన మృతదేహాన్ని సూర్యాపేటకు తరలించి సూర్యాపేటలోని రెడ్‌హౌస్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అదే రోజు రాత్రి పార్థివదేహాన్ని తుంగతుర్తికి తరలించి 4వ తేదీ మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

జగదీష్‌రెడ్డి సంతాపం

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి మృతి పట్ల సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు తనదైన ముద్ర వేసుకున్న రాంరెడ్డి దామోదర్ రెడ్డి అకాల మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలలో ఎన్నికల కోడ్ అమలులో లేదని తెలిపారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని, అసత్య ప్రచారాన్ని ప్రసారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీల మీటింగులు, ర్యాలీలకోసం అనుమతులు తీసుకోవాలన్నారు. ఎవరికైనా ఎలక్షన్ పై సందేహాలు ఉన్నా, ఫిర్యాదు చేయాలనుకున్నా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జెడ్పీసీఈఓ వి.వి. అప్పారావు, డీపీఓ యాదగిరి, రాజేశ్వరరావు, లింగయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ఆబిద్, కోట గోపి, స్టాలిన్, వెంకటేశ్వర్లు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, డీఎల్‌పీఓ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆ గ్రామాల్లో దసరా ప్రత్యేకం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేట మండల కేంద్రంలో, రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో ప్రతి ఏడాది దసరా పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. లక్ష్మాపురం గ్రామంలో దసరా రోజు గ్రామస్తులు జాతీయ జెండాను ఎగురవేస్తారు. రాజాపేట మండల కేంద్రంలో ఠాకూర్ వంశస్తులు జాతీయ జెండా, తల్వార్లతో ర్యాలీగా జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు చేస్తారు.

దసరా రోజు జాతీయ జెండా ఆవిష్కరణ



లక్ష్మాపురంలో దసరా రోజు జాతీయ జెండాకు వందనం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

రామన్నపేట: రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో దసరా రోజు జాతీయ జెండాను ఎగురవేస్తారు. గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుండి కచ్చీరు వద్ద జాతీయ జెండాను ఎగురవేసే సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన పటేల్ వంశస్థులు పండుగ రోజు తెల్లవారుజామున పాత జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఉదయం 10గంటల సమయంలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి కొత్త జెండా కర్రకు అలంకరణ చేసి కొత్త తాడుతో జాతీయ జెండాను ఎగర వేయడం జరుగుతుంది. జాతీయ పతాకావిష్కరణలో గ్రామస్తులంతా పాల్గొంటారు. జమ్మిచెట్టు వద్దకు పూజకు వెళ్లే సమయంలో అక్కడే పూజలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులకు, కులపెద్దలకు కంకణాలు అందజేస్తారు. జమ్మిచెట్టు నుంచి జాతీయజెండా వద్దకు తిరిగి వచ్చి ఒకరికొకరు జమ్మి పెట్టుకొని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అదేవిధంగా నిధానపల్లిలో బురుజుపైన, నీర్నెముల, శోభనాద్రిపురం, సిరిపురం గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.



ప్రత్యేకంగా ఠాకూర్ వంశస్తులు

రాజాపేటలో దసరా రోజు జమ్మి కోసం ప్రదర్శనగా వెళ్తున్న ఠాకూర్ వంశస్తులు (ఫైల్)

రాజాపేట : దసరా పండుగను రాజాపేట మండల కేంద్రంలో ఠాకూర్ వంశస్తులు ప్రత్యేకంగా జరుపుకుంటారు. చాలామంది హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ పండుగ రోజు స్వగ్రామానికి విచ్చేసి వేడుకల్లో పాల్గొంటారు. రాజుల కాలం నుంచి గ్రామానికి చెందిన ఠాకూర్ వంశస్తులు దుర్గామాతకు నవ రాత్రులు పూజలు నిర్వహించి 9వ రోజు ఆయుధపూజ నిర్వహిస్తారు. సంప్రదాయ దుస్తులు ధరించి గుర్రం(సిరిమల్లె) వంశీయులతో కలిసి డప్పువాయిద్యాలతో గడికోటలోని మైసమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజ లు చేస్తారు. అనంతరం జాతీయ జెండాను చేతబూని తల్వార్లతో ప్రదర్శన నిర్వహిస్తూ జమ్మి కోసం బయల్దేరుతారు. గ్రామ శివారులోని సంఘమేశ్వరస్వామి దేవాలయం వరకు చేరుకుని జమ్మి వృక్షానికి పూజలు చేస్తారు. పూర్వం మాత్రం ఠాకూర్ వంశానికి చెందిన సత్యనారాయణసింగ్ తనకున్న లైసెన్స్ గన్ భుజానికి వేసుకుని ఊరేగింపుగా వెళ్లి శమిపూజ తర్వాత గన్‌తో రెండుమార్లు తూర్పుదిక్కు గాలిలోకి పేల్చిన అ నంతరం ప్రజలు జమ్మి తీసుకునేవారు. ఠాకూర్ సత్యనారాయణసింగ్ 1994 వరకు ఈ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

ప్లాస్టిక్ భూతంపై సమరం

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో 15 అడుగుల భూతం తయారీ
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో గ్రీన్ క్లబ్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రదర్శన

సూర్యాపేట అర్బన్: సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన గ్రీన్ క్లబ్ ట్రస్టు కొన్నేళ్లుగా ప్లాస్టిక్ భూతంపై సమరం సాగిస్తోంది. ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దేశంలోనే మొదటిసారిగా సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో గల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్ వద్ద మున్సిపాలిటీ సహకారంతో ఏర్పాటు చేసిన 15 అడుగుల ప్లాస్టిక్ భూతాన్ని బుధవారం ఆ క్లబ్ సభ్యులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లబ్ ట్రస్టు అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ మాట్లాడుతూ రావణాసురుడి కంటే భయంకరమైనది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అని పేర్కొన్నారు. విజయదశమి నుంచి ప్లాస్టిక్‌ను తరిమివేస్తామంటూ ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యులు తోట కిరణ్ సహాయ కార్యదర్శి దేవర శెట్టి నాగరాజు ముప్పారపు నాగేశ్వరరావు, తల్లాడ రామచంద్రయ్య, తొణుకునూరు మురళీమోహన్‌లను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.హనుమంతరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండి గౌసుద్దీన్, పర్యావరణ విభాగం ఇంజనీర్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.



15 అడుగుల ప్లాస్టిక్ భూతం



మిర్యాల గ్రామం వ్యూ

పండుగకు నోచుకోని గ్రామాలు

- రాజకీయ ఆధిపత్యంతో 42 ఏళ్లుగా దసరా జరుపుకోని చిల్పకుంట్ల గ్రామస్తులు
- కంకణం కట్టే విషయంలో తగాదాతో మిర్యాల, మాచనపల్లి వాసులు కూడా పండుగకు దూరం

నూతనకల్: రాజకీయ ఆధిపత్యం, కులాల మధ్య తగాదాతో నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల, మిర్యాల, మాచనపల్లి గ్రామాల్లో గత కొన్నేళ్లుగా ఆయా గ్రామస్తులు దసరా పండుగ జరుపుకోవడం లేదు. గతంలో దసరా పండుగ రోజు కంకణం కట్టే విషయంలో ఏర్పడిన చిన్న తగాదా నేటి వరకు కూడా ఆయా గ్రామాలు దసరా వేడుకలకు నోచుకోకుండా ఉన్నాయి. చిల్పకుంట్ల, మిర్యాల గ్రామాల్లో ఆనవాయితీగా గ్రామ సర్పంచ్ దసరా ఉత్సవాల్లో కంకణం కట్టే సాంప్రదాయం కొనసాగుతుండేది. చిల్పకుంట్ల గ్రామం సీపీఎం ఆధిపత్యంలో కొనసాగుతుండగా.. 1982లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్) అభ్యర్థి బాణాల చంద్రారెడ్డి సర్పంచ్‌గా గెలుపొందారు. ఆయన కంకణం కట్టే విషయంలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో 42 ఏళ్లుగా ఆ గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం లేదు. అదేవిధంగా మిర్యాల గ్రామంలో మూడుసార్లు సర్పంచ్‌గా ఎన్నికైన నాగేశ్వర్‌రావుకు కంకణం కట్టే విషంలో ఏర్పడిన ఘర్షణ వలన నాగేశ్వర్‌రావు హత్యకు గురయ్యాడు. దీంతో నాటి నుంచి నేటి వరకు గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం లేదు. మాచనపల్లి గ్రామంలో కులాల మధ్య కంకణం కట్టే విషయంలో ఏర్పడిన తగాదాల వలన దసరా ఉత్సవాలు నిర్వహించడం లేదు.

పండుగ గుర్తెరగం



నా చిన్నతనం నుంచి నేటి వరకు కూడా మా గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం చూడలేదు. మా గ్రామంలో గతంలో దసరా ఉత్సవాల సందర్భంగా కంకణం కట్టే విషయంలో కులాల మధ్య ఏర్పడిన ఘర్షణల వలన నేటికీ పండుగ జరుపుకోవడం లేదు.

– పసునూటి అయోధ్య, మాచనపల్లి

దసరా జరుపుకునేలా చూడాలి



నా వయస్సు 34 సంవత్సరాలు. గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించక దాదాపు 42 సంవత్సరాలు. మా గ్రామంలో సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మధ్య ఆధిపత్య పోరుతో కంకణం కట్టుకునే విషయంలో ఏర్పడిన ఘర్షణ వలన దసరా జరుపుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, రాజకీయ పార్టీల నాయకులు కలిసి దసరా పండుగ జరుపుకునేలా చూడాలి.

– పులుసు సతీష్‌గౌడ్, చిల్పకుంట్ల

నాణ్యమైన సేవలు అందిస్తాం

- బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశం



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను సన్మానిస్తున్న వెంకటేశం తదితరులు

నల్లగొండ, రామగిరి (నల్లగొండ): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తామని ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం అన్నారు. బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పానగల్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ సాంకేతికతతో నిర్మించబడిన బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్లను ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. ప్రజలకు చవక, నమ్మదగిన సేవలను అందిస్తూ బీఎస్ఎన్ఎల్ ముందంజలో ఉందని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్‌టీటీహెచ్ ప్యాకేజీలు రూ.299, రూ.399లో భాగంగా వినియోగదారులకు ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్, టీవీ ఛానల్స్, ఓటీటీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మురళీకృష్ణారెడ్డి, ఐఎఫ్ఏ సత్యనారాయణ, ఏజీఎం సుబ్బారావు, శాంతికుమారి, రాములు, సురేందర్, వెంకన్న, నరేందర్, జీవన్‌కుమార్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు శ్రమించిన పోలీసులు



క్రేన్ సహాయంతో యాసిడ్ ట్యాంకర్‌ను తొలగిస్తున్న దృశ్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద మంగళవారం యాసిడ్ ట్యాంకర్ బోల్తా పడగా.. దాని కింద పడి నలిగిపోయిన తూఫాన్ వాహనాలను బయటకు తీసేందుకు పోలీసులు అర్ధరాత్రి వరకు శ్రమించారు. యాసిడ్ ట్యాంకర్ తలకిందులుగా పడటం, అందులో యాసిడ్ ఉండడం, పోలీసులు రెండు జేసీబీలు, మూడు క్రేన్‌లు తీసుకొచ్చి ఐదు గంటలకు పైగా శ్రమించిన తర్వాత ట్యాంకర్ పైకి లేచింది. దానిని రోడ్డు పక్కకు ఉంచారు. అదేవిధంగా ట్యాంకర్ కింద నుజ్జునుజ్జయిన తూఫాన్ వాహనాలను బయటకు తీశారు.

నాగార్జునసాగర్‌కు తగ్గిన వరద



26 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 4,14,188 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అంతే నీటిని సాగర్ జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు. 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 3,61,322 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన ద్వారా 33,536, మొత్తం 3,94,858 క్యూసెక్కుల నీటిని దిగువకు కృష్ణానదిలోకి వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువ, ఏఎంఆర్పీ, వరద కాలువలకు 19,330 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.